క్లుప్తంగా

ఘనంగా శివాలయం వార్షికోత్సవం

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేమకోటి రమాకాంత్‌శర్మ, భోగాపురపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు పెంకి లక్ష్మునాయుడు, అనూరాధ పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు చేశారు.

ఆరోగ్యంపై ఆరా..



మాజీ సర్పంచ్ సుధను పరామర్శిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

తెర్లాం: అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కొరటాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుల్లిపల్లి సుధను బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. మంగళవారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరామర్శలో ఆయన వెంట మండలానికి చెందిన పలువురు నాయకులు, సర్పంచ్‌లు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని గారానాయుడుపేట, పనసపేట గ్రామాల మధ్య సాయన్న ఛానల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు బుధవారం భూమిపూజ చేశారు. ఇక్కడ ఉండే ఇనుప వంతెన గతంలో వరదలకు కొట్టుకుపోయింది. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించి రూ.8 లక్షల జెడ్పీ నిధులతో బ్రిడ్జి మంజూరుచేశామని అన్నారు. బ్రిడ్జి పనులు వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయ్యి మోహనరావు, కూర్మాన సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

రేగిడి: రైతులకు కల్తీలేని, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న శ్రీమాతా ట్రేడర్స్ దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను, అందుబాటులో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

రేగిడి: మండలంలోని రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్న అగ్రహారం, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లో చేపట్టిన ఈ-క్రాప్ నమోదును బుధవారం పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రభుత్వం పంట కొనుగోలు చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ-క్రాప్ నమోదుకు వచ్చే అగ్రికల్చర్ అసిస్టెంట్లకు రైతులు సహకరించాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని రేగిడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణంలోని తెలగవీధికి చెందిన బాలికను గర్భవతిని చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.రవికిరణ్ బుధవారం తెలిపారు. రాజాం తెలగవీధికి చెందిన 17 ఏళ్ల బాలికకు చీపురుపల్లి మండలం పెద్దనడిపల్లి గ్రామానికి చెందిన బంకపల్లి రవితో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమ గా మారడంతో అతని మాటలను నమ్మి గత ఏడాది మార్చి నెలలో ఇరువురు తిరుపతి వెళ్లి తిరిగి వచ్చారు. మరలా అతని ఒత్తిడి మేరకు జూన్ నెలలో పెద్దనడిపల్లి వెళ్లి అతనితో కలిసి జీవించింది. ఇదిలా ఉండగా ఆమె నెలతప్పిందని, ఏడవ నెల గర్భవతిగా ఉన్నప్పుడు అతను పెట్టే బాధలు తట్టుకోలేక రాజాంలోని కన్నవారింటికి వచ్చింది. తనకు మాయమాటలు చెప్పి బలవంతంగా లోబర్చుకుని గర్భవతిని చేశాడని బాలిక చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రైతుకు వెన్నుదన్నుగా సహకార సంఘాలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



గోదాం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రైతన్నకు రుణాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తూ సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో నిర్మించిన గోదాము, జనరిక్ మందుల షాపును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రాథమిక సహకార సంఘాలు పూర్తిగా నిర్వీర్యం అవుతున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సహకార సంఘాలకు ఆర్థిక వనరులు సమకూర్చి పునర్జన్మనిచ్చారన్నారు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పీఏసీఎస్‌ల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రుణాలు అందక ఇబ్బందులు పడుతున్న రైతులను పీఏసీఎస్‌ల ద్వారా ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. అలాగే ఆర్‌బీకేల ద్వారా ఎరువులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పీఏసీఎస్‌లను వినియోగించుకుని ఆర్థికంగా మెరుగుపడాలని ఆకాంక్షించారు. అలాగే జనరిక్ మందుల షాపులో నాణ్యమైన మందులు తక్కువ ధరకు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, డీసీసీబీ సీఈఓ కె. జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ సభ్యులు పి. వెంకటరమణ, మండల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై స్ప్రింక్లర్ పైపులు



డ్రిప్ ఇరిగేషన్ పైపులను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

రాజాం: రైతులకు 90 శాతం రాయితీపై స్ప్రింక్లర్ పైపులు అందిస్తున్నామని జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మండలంలో బొద్దాం గ్రామంలో తుంపర, బిందు సేద్యం నిమిత్తం పంపిణీ చేసిన స్ప్రింక్లర్, డ్రిప్ పైపులను బుధవారం పరిశీలించారు. స్ప్రింక్లర్ల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పండ్లతోటలు, కూరగాయల సాగుతో పాటు వాణిజ్య పంటల సాగుకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో బాగుంటుందన్నారు. 5 ఎకరాల్లోపు పంటపొలాలు ఉంటే 90 శాతం రాయితీ, 5 ఎకరాలు దాటి ఉంటే 50 శాతం రాయితీ వస్తుందన్నారు. ఆధార్‌కార్డు నకలు, టైటిల్ డీడ్, ఎఫ్‌ఎంబీ స్కెచ్, ఓటరు గుర్తింపు కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, ఎస్సీ, ఎస్టీ కులస్తులకు కులధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు గడువు ఉందన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన



డాక్టర్ తలే రాజేష్‌కు యూపీహెచ్‌సీ వివరాలు తెలియజేస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: పట్టణంలోని ఆదర్శనగర్, డోలపేట ప్రాంతాల్లో రూ.1.60 కోట్లతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరిశీలించారు. యూపీహెచ్‌సీల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ నెల 19న యూపీహెచ్‌సీలను ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడి పరిసరాలను శుభ్రం చేయాలని కమిషనర్ జె.రామఅప్పలనాయుడుకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన హంగులతో పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ వెంకట్ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



వండానపేట పాఠశాలలో జగనన్న గోరుముద్దను పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనాలు పెట్టాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద అమలును బుధవారం పరిశీలించారు. వండిన వంటలపై మూతలు పెట్టాలని, కాచి, చల్లార్చిన నీటిని పిల్లలకు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, తదితరులున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ముద్దాడజోగివలసలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలో వలసలు లేకుండా అన్ని గ్రామాల్లో వేతనదారులకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండలంలో ముద్దాడ జోగివలస, కొఠారిపురం, అమరాం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. వేతనదారుల వివరాలు సేకరించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని, గరిష్ఠ వేతనం అందేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వారి వెంట టీఏ సత్యనారాయణ ఉన్నారు.

వ్యాక్సినేషన్



వ్యాక్సిన్లు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వంగర: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. హెచ్‌వీ తవిటమ్మ, ఏఎన్‌ఎం విశాలాక్షి ఆధ్వర్యంలో గర్భిణులు, చిన్నారులకు రోటా, పెంటా, ఓపీవీ, ఐపీవీ, మీజిల్స్, విటమిన్-ఎ వ్యాక్సిన్లు వేశారు. వ్యాధులకు దూరం చేసే ఈ తరహా వ్యాక్సిన్స్ సకాలంలో వేస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనదారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోండి

బాడంగి: ఉపాధి వేతనదారులందరూ పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ 80 శాతం మంది పనులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఆయనతో పాటు ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ బుజ్జి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించండి

బాడంగి: మండలంలోని పోలింగ్‌కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు సందర్శించి నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్ ఎస్. రాజారావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో మాట్లాడుతూ.. కేంద్రాల్లో మౌలిక వసతులు ఉన్నదీ, లేనిదీ తెలుసుకోవాలని సూచించారు. సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఇరిగేషన్ ఏఈలు ప్రవీణ్‌కుమార్, రామినాయుడు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఎంఈఓ-1 దొర, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

సంతకవిటి: మండలంలోని బొద్దూరు సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సచివాలయ రికార్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను తనిఖీ చేశారు. ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని సూచించారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలల వసతి గృహంలో బుధవారం స్వర్గీయ దామోదరం సంజీవయ్య 103వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి తహసీల్దార్ ఎస్‌కే రాజు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఆర్.జయరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేశారని, తెలుగును అధికారిక భాషగా ప్రకటించేందుకు కృషిచేశారని గుర్తుచేశారు. మహాత్ముని బాటలో నడుస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో దళితనాయకులు బొత్స బుద్ధుడు, సమతా సైనిక్ దళ్ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేగల మోహన్, వసతిగృహ సంక్షేమ అధికారి ఏగేటి అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రండి బాబూ రండి..

- లోకేష్ సభకు ముఖం చాటేసిన ప్రజలు
- వారిని తీసుకొచ్చేందుకు టీడీపీ నాయకుల తంటాలు
- ఎలాగోలా శంఖారావాన్ని ముగించేసిన ముఖ్య నాయకులు



లోకేష్ సభకు వచ్చిన సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

బొబ్బిలి/బాడంగి:

ఏం ఇంకా ఎక్కడున్నారయ్యా..? సారొచ్చేశారు.. మీరు రాకపోవడంతో మళ్లీ బస్సులోకి వెళ్లిపోయారు. త్వరగా రండి ! మీటింగ్ స్టార్టయిపోయింది. మరెప్పుడొస్తారు?.. ఇదీ బొబ్బిలి నియోజకవర్గంలోని బాడంగి మండల కేంద్రంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొన్న శంఖారావం బహిరంగ సభ దుస్థితి. కుర్చీలను నింపేందుకు టీడీపీ నాయకులు నానా హైరానా పడాల్సి వచ్చింది. బాడంగి మండల కేంద్రంలో బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఉపాధి హామీ వేతనదారులకు రూ.200 ఇచ్చి ఆటోల్లో తీసుకువచ్చేందుకు గ్రామాలకు వాహనాలను పంపారు. అయితే సాయంత్రం 5.30 గంటలైనా ప్రజలెవ్వరూ రాకపోవడంతో ఖంగుతిన్న స్థానిక నాయకులు లోకేష్‌ను కాసేపు నిలువరించారు. మరికొద్దిసేపట్లో జనాల్ని తీసుకువస్తామని చెప్పి వెనుక ఏర్పాటు చేసిన టెంట్‌లోకి లోకేష్‌ను పంపిచారు. ఈ సమయంలో ఆయన ఆగ్రహాన్ని తగ్గించేందుకు స్థానిక నాయకులతో ఫొటోషూట్ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈలోగా కార్యకర్తలు, ప్రజలను రప్పించిన నాయకులు గ్యాలరీలు నిండాయని చెప్పడంతో లోకేష్ వేదికపైకి వచ్చారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబీనాయన, జనసేన పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడులు లోకం మాధవి, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామిలను మాత్రమే వేదికపైకి ఎక్కించారు. అయితే లోకేష్‌తో పాటు అప్పలస్వామి, బేబీనాయన, లక్ష్మునాయుడులు మాత్రమే మాట్లాడారు.

సైడ్‌లైట్స్..

- లోకేష్ మాట్లాడుతూ తన తాత పేరున్న తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్‌ను రామతీర్థం ప్రాజెక్టని... వేగావతి నదిని పాలేరు నది అని.. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట వద్ద ఉన్న పెద్దగెడ్డ ప్రాజెక్ట్ రామభద్రపురంలో ఉందని చెప్పడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.
- మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం తన తప్పేనని, త్వరలోనే ఆయన్ను చట్టసభలకు పంపిస్తానని లోకేష్ హామీ ఇచ్చారు. అలాగే బొబ్బిలిలో శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని తెలిపారు.
- మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, తదితర మండల స్థాయి నాయకులను కూడా ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వర్మ, అప్పలస్వామి, తదితరులు

బొబ్బిలి: కిసాన్‌మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టనున్న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతుకూలీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పట్టణ కలాసీ సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రకటించిన మూడు నల్ల చట్టాలను ప్రజా సంఘాల పోరాటంతో రద్దు చేశామని చెప్పిన తర్వాత కూడా అమలు చేయాలనుకోవడం తగదన్నారు. భారత ఆహార సంస్థ గిడ్డంగులను ఇప్పటికే అదానీకి కట్టబెట్టిన కేంద్రం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించే ప్రయత్నంలో ఉందని ఆరోపించారు. అనంతరం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ కలాసీ సంఘ గౌరవాధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, రాజు, అప్పారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



రాజాం సిటీ: సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు



బొబ్బిలి: సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు

రాజాం సిటీ: వసంత పంచమి సందర్భంగా స్థానిక బస్టాండ్ ఆవరణలోని జ్ఞాన సరస్వతిదేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ కె.శివకేశవరావు, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, అర్చకులు రంపా రామచంద్రరావుశర్మ పర్యవేక్షణలో సుమారు 200 మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

రాజాం: వసంత పంచమిని పురస్కరించుకుని పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని పెనుబాక, బొద్దాం, డోలపేట, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సరస్వతీదేవికి పూజలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని వైజ్ స్కూల్లో వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతీదేవికి ప్రత్యేక పూజలతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

వంగర: మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో సరస్వతీదేవికి విద్యార్థులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు.

ఘనంగా ..

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు స్థానిక శాఖా గ్రంథాలయంలో వసంత పంచమి(సరస్వతీదేవి పుట్టినరోజు) వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం

బొబ్బిలి: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 34 మంది అక్షరాభ్యాసం చేయించుకున్నారు. కార్యక్రమానికి ఓ భారత్ శక్తిపీఠం వ్యవస్థాపకుడు భారతానంద మహరాజ్, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాగాల రాజారావు, చిన్నారుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

పరామర్శ



చిరంజీవినాయుడుని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన పోతురాజు చిరంజీవినాయుడు, శ్రీనివాసరావు తల్లి పోతురాజు అన్నపూర్ణ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పార్టీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, పోతురాజు బ్రహ్మంనాయుడు, లెంక గణనాథ, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


- లోకేష్ పర్యటనలో అపశృతి



క్షతగాత్రుడు జామి అప్పన్న

బాడంగి: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం సభ బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సభలో పాల్గొనేందుకు గజరాయునివలసకు చెందిన నల్ల తిరుపతి, జామి అప్పన్న, తెర్లి రాము, కొల్లి సింహాచలం రెండు బైక్‌లపై వచ్చారు. సభ అనంతరం తిరుగు ప్రయాణంలో సరిగ్గా డొంకినవలస మట్టిరోడ్డు వద్దకు వచ్చే సరికి తిరుపతి, అప్పన్న ఉన్న వాహనాన్ని వెనుక నుంచి మరో వాహనంపై వస్తున్న తెర్లి రాము, కొల్లి సింహాచలం ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికీ గాయాలు కాగా వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్ల తిరుపతి, జామి అప్పన్నలను జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. రాము, సింహాచలంకు ప్రాథమిక వైద్యం చేసి ఇంటికి పంపించేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్‌రోడ్డు నిర్మాణం



ఎస్సీకాలనీలో వేసిన గ్రావెల్ రోడ్డు

వంగర: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ వెనుకవైపు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతంలో సరైన దారి లేక స్థానికులు ఇబ్బందులు పడేవారు. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో నానా అవస్థలు పడ్డారు. గత పాలకులు కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. సమస్యపై స్పందించిన స్థానిక సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనగల పారినాయుడు గ్రామ పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో శివ్వాం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చిన్నవీధి వరకు 250 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వేశారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.